ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 3 నవంబరు 2024



తోలుబొమ్మపై విష్ణు అవతారాలు



తోలుబొమ్మను రూపొందిస్తున్న దళవాయి కుళ్లాయప్ప

ఆ ఇంట.. అవార్డుల పంట..

తోలుబొమ్మల తయారీ, ప్రదర్శనలో దళవాయి కుటుంబం పెట్టింది పేరు. నేటితరాన్ని ఆకట్టుకునేలా తోలుబొమ్మలను తయారు చేస్తుంటారు. వీటిని కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో సందర్శనకు ఉంచుతున్నారు. వీరి కళానైపుణ్యానికి అవార్డుల పంట పండుతోంది. శివమ్మ ప్రతిభను మెచ్చి కేంద్రప్రభుత్వం హస్తకళల విభాగంలో 2019కిగాను జాతీయపురస్కారానికి ఎంపిక చేసింది. రామరావణ యుద్ధ కాండాన్ని ఒకే తోలుబొమ్మపై ఆమె రూపొందించారు. శివమ్మ కుమారుడు దళవాయి కుళ్లాయప్పకు 2017కిగాను జాతీయ అవార్డు దక్కింది. ఢిల్లీలో తల్లి, కుమారుడు.. ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్‌ఖడ్, కేంద్ర జౌళిశాఖమంత్రి పీయూష్ గోయల్ చేతులమీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు.



తోలుబొమ్మను చూపుతున్న దళవాయి శివమ్మ



జాతీయస్థాయి పురస్కారానికి ఎంపికైన రామరావణ యుద్ధకాండ తోలుబొమ్మ

తోలుబొమ్మల పుట్టిల్లు..!

ప్రాచీన కళకు ప్రాణం పోస్తున్న దళవాయి కుటుంబం

- తోలుబొమ్మల తయారీతో గుర్తింపు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రదర్శనలు
- పలు జాతీయ అవార్డులు కైవసం



జాతీయ అవార్డుకు ఎంపికైన తోలుబొమ్మ



శ్రీకృష్ణలీలలపై రూపొందించిన తోలుబొమ్మ

ఆ ఇంట్లోకి అడుగు పెట్టగానే..
ఒంపులు తిరిగిన
హనుమంతుడు స్వాగతిస్తాడు..
రామాయణ, మహాభారత ఘట్టాలు..
కళ్లకు కడతాయి..
ఎన్నో అపురూపమైన..
అద్భుతమైన కళాఖండాలు
పలకరిస్తాయి..
గెంతులేస్తాయి..
అందమైన బొమ్మల పొదరింట్లోకి
తీసుకెళ్తాయి..
అదే.. దళవాయి శివమ్మ ఇల్లు..
తోలుబొమ్మల పుట్టిల్లు..
తోలుపై అబ్బురపరిచే
కళాఖండాలకు
సృష్టిస్తూ..
అంతరించిపోతున్న కళకు
ప్రాణంపోస్తోంది ఆ కుటుంబం..
విదేశాల్లో సైతం ప్రదర్శనలిస్తూ..
దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తోంది..
ప్రాచీన కళకు..
ఆధునిక సొబగులు అద్దుతూ..
తోలుబొమ్మను
బతికించుకుంటున్నామంటున్న
దళవాయి కుటుంబం
సక్సెస్ స్టోరీయే..
ఈ వారం సండే స్పెషల్..





Sunday SPECIAL

ధర్మవరంరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తోలుబొమ్మలాటకు ఎంతో ఘన చరిత్ర ఉంది. గతంలో తోలుబొమ్మల ప్రదర్శనకు ఎంతో ఆదరణ దక్కేది. కాలక్రమేణా ప్రాచీన హస్తకళ కనుమరుగైపోతోంది. అప్పట్లో ఊరూరా ఆడిన తోలుబొమ్మ ఇప్పుడు కనిపించకుండా పోతోంది. ప్రస్తుతం తోలుబొమ్మలాట అంటేనే చాలామందికి తెలీదు. అలాంటి హస్తకళ ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామంలోని దళవాయి శివమ్మ ఇంట కొత్త జన్మ ఎత్తుతోంది. ప్రాచీన తోలుబొమ్మకు ఆధునిక సొబగులు అద్దుతూ విశ్వవ్యాప్తంగా ఆదరణ పొందుతోంది ఆ కుటుంబం. జాతీయ అవార్డులను కొల్లగొడుతోంది. తరతరాలుగా జీవనాధారమైన అపురూపమైన కళను కాపాడుకుంటోంది.

తోలుబొమ్మల తయారీ, ప్రదర్శనలో దళవాయి కుటుంబంలో అందరూ దిట్టలే. తరతరాలుగా తోలుబొమ్మ ఆ కుటుంబ జీవనాధారం. తోలుబొమ్మలను కాలానుగుణంగా తయారుచేస్తూ, ప్రదర్శనలు ఇస్తుంటారు దళవాయి కుటుంబీకులు. దేశవిదేశాల్లో తొలుబొమ్మల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటుచేసి, విక్రయాలు సాగిస్తున్నారు. ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకుంటున్నారు. దళవాయి శివమ్మ భర్త చిన్ననారాయణకు తోలుబొమ్మల తయారీ జీవనాధారం. వారికి ముగ్గురు కుమారులు. అందరూ తోలుబొమ్మల కళాకారులే.

శిల్పగురు.. శివమ్మ..

హస్తకళల విభాగంలో శిల్పగురు జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం. దళవాయి శివమ్మ తోలుబొమ్మల కళకు మెచ్చి, కేంద్ర ప్రభుత్వం రెండునెలల క్రితం శిల్పగురు అవార్డుకు ఎంపిక చేసింది. దక్షిణాది నుంచి శివమ్మ మాత్రమే ఈ అవార్డుకు ఎంపికవడం హర్షదాయకం. దళవాయి శివమ్మ రూపొందించిన శ్రీకృష్ణచరిత పెయింటింగ్, విశ్వరూప హనుమాన్ తోలుబొమ్మ కేంద్రప్రభుత్వ అవార్డుకు ఎంపికయ్యాయి.

తోలుబొమ్మలపై రామాయణం, మహాభారతాలు

తోలుబొమ్మలపై రామాయణం, మహాభారతం, శ్రీకృష్ణలీలలు ఘట్టాలను రూపొందిస్తున్నారు దళవాయి కుటుంబీకులు. గతంలో వీటితో నాటకాలు ప్రదర్శించేవారు. రానురాను నాటకాల పట్ల ఆసక్తి తగ్గిపోయింది. దీంతో యువతరం ఆసక్తిగా తగ్గట్టుగా తోలుబొమ్మలను తయారు చేస్తోంది శివమ్మ కుటుంబం. వాటిని గృహాల్లో అలంకరణ వస్తువుల్లా ఏర్పాటు చేసుకునేలా తయారుచేసి, దేశవిదేశాల్లో విక్రయిస్తున్నారు.

కుటుంబమంతా కళాకారులే...

తరతరాలుగా తోలుబొమ్మల కళాకారుల కుటుంబం దళవాయి శివమ్మది. శివమ్మ భర్త చిన్ననారాయణ తోలుబొమ్మల కళాకారుడు. కొన్నేళ్ల క్రితం చిన్ననారాయణ మృతిచెందారు. భర్త నుంచి శివమ్మ తోలుబొమ్మల తయారీ విద్యను నేర్చుకున్నారు. ఆమెతోపాటు ముగ్గురు కుమారులు దళవాయి కుళ్లాయప్ప, రాజు, దుర్గేష్ కూడా ఇదే వృత్తిలో జీవనం సాగిస్తున్నారు. ప్రతిఒక్కరూ తోలుబొమ్మలు తయారు చేయడం, ప్రదర్శించడం ద్వారా ఖ్యాతి గడించారు. రాష్ట్రంలోనే కాక దేశవిదేశాల్లో సైతం తోలుబొమ్మలను ప్రదర్శిస్తూ మన్ననలు పొందుతున్నారు.



కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న దళవాయి కుళ్లాయప్ప (ఫైల్)



కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న శివమ్మ (ఫైల్)

చేతివృత్తులకు ప్రోత్సాహం అందించాలి

కాలానుగుణంగా ప్రజలకు చేరవయ్యేలా తోలుపై రామాయణం, మహాభారతంలోని ఘట్టాలు, పెయింటింగ్స్ రూపొందిస్తూ తోలుబొమ్మల కళను కాపాడుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్రోత్సాహం అందిస్తే తోలుబొమ్మల కళ అభివృద్ధికి మరింత కృషి చేస్తాం. ప్రభుత్వాలు సబ్సిడీలు అందించి, ఆదుకోవాలి.

- దళవాయి శివమ్మ కళాకారిణి



రోడ్లకు మహర్దశ

జిల్లావ్యాప్తంగా రోడ్డు మరమ్మతులకు శ్రీకారం.. పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు



తిమ్మాపురంలో రోడ్డు మరమ్మతులను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన ఐదేళ్లూ రోడ్ల నిర్మాణాన్ని గాలికొదిలేశారు. కనీసం దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో రోడ్లపై గుంతలు ఏర్పడి, అవి పెద్దపెద్ద గోతుల్లా మారాయి. వాటిలో వాహనాలు పడి, ఎందరో వాహనదారులు గాయాలపాలయ్యారు. పలువురు ప్రాణాలు కోల్పోయారు కూడా. అయినా.. గత పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెలలు తిరక్కనే రోడ్లపై దృష్టిపెట్టారు. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. రోడ్డు మరమ్మతులు ప్రారంభించారు. త్వరలో కొత్తరోడ్లు నిర్మిస్తామన్నారు. దీంతో ప్రజలకు.. గుంతల కష్టాలు తీరనున్నాయి.

ఐదేళ్లూ నరకమే.. : మంత్రి సవిత

వైసీపీ పాలన ఐదేళ్లూ రోడ్లపై జనం నరకం అనుభవించారని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత విమర్శించారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధి తిమ్మాపురం పాత జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చే పనులను మంత్రి ప్రారంభించారు. గుంతలపై తారు, కంకరవేసి పూడ్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సంక్రాంతిలోపు రాష్ట్రవ్యాప్తంగా రహదారులకు మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి రోడ్లను నిర్వీర్యం చేయడంతో ఎంతోమంది ప్రజలు, వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రోడ్డు గుంతలకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. కొత్త రోడ్లు సైతం నిర్మిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని మంత్రి పేర్కొన్నారు.



ధర్మవరంలో రోడ్డుపై గుంతను పూడ్చుతున్న మంత్రి సత్యకుమార్



రోడ్డు గుంతను పూడ్చుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

వాహనదారుల భద్రతకు భరోసా

ఎమ్మెల్యే కందికుంట

తనకల్లు: రహదారులకు మరమ్మతులు చేపట్టి వాహనదారుల భద్రతకు భరోసా కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కొక్కంటి క్రాస్, బొంతలపల్లి గ్రామాల్లో రోడ్డు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో రోడ్లపై గుంతలు పడి, ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారినపడడమేకాకుండా పలువురు చనిపోయారని ఆవేదన చెందారు. కూటమి అధికారంలోకి రాగానే రోడ్ల మరమ్మతులు చేపట్టామన్నారు. సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని ఉద్ఘాటించారు.

రోడ్లు.. ఆర్థికాభివృద్ధి సూచికలు..

మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం: రోడ్లు ఆర్థికాభివృద్ధికి సూచికలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపాన రోడ్డుపై ఉన్న గుంతలను శనివారం మంత్రి సత్యకుమార్ యాదవ్ పూడ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు రోడ్ల అభివృద్ధికి రూ.860కోట్లు కేటాయించడం శుభపరిణామమన్నారు. నియోజకవర్గంలో రూ.2.90కోట్లతో రోడ్ల గుంతలను పూడ్చుతామన్నారు. గత వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధి అటకెక్కిందన్నారు. కూటమి పాలనలో రహదారుల మరమ్మతులు, నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇది అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు.

రోడ్ల నిధులను మళ్లించిన జగన్

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు: గత వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులను అప్పటి సీఎం జగన్ దారి మళ్లించారని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆరోపించారు. దీంతో ఎక్కడ చూసినా గుంతలరోడ్లే కనబడుతున్నాయనారు. మండలంలోని మరకుంటపల్లికి వెళ్లే రహదారిపై గుంతలను ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ టీఎస్ చేతన్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పూడ్చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దోచుకుని దాచుకోవడమే తప్ప.. రోడ్లు, రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. రోడ్ల నిర్మాణానికి కేంద్రం రూ.వేలాది కోట్ల నిధులిచ్చిందనీ, అవి ఏమయ్యాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు ఉన్న అరకొర నిధులతోనే రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు.

ఖాద్రీశుడి ఆలయానికి కార్తీక శోభ

పోటెత్తిన భక్తులు



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

కదిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి కార్తీక శోభ వచ్చింది. కార్తీక మాసం మొదటి శనివారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణ మొత్తం భక్తులతో నిండిపోయింది. స్వామివారి ధ్వంజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి.

సత్యసాయితత్వంలో శాంతి



నాటికలోని సన్నివేశం

పుట్టపర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సత్యసాయితత్వంలో పయనించిన వారి జీవితం శాంతిమయమవుతుందని గుజరాత్ రాష్ట్ర భక్తులు నాటిక ద్వారా తెలియజెప్పారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో ఆ రాష్ట్ర నూతన సంవత్సర వేడుకలు మూడోరోజు శనివారం కూడా కొనసాగాయి. సూరత్ సాయియూత్ సంజీవని పేరిట ప్రదర్శించిన నాటిక భక్తులను అలరింపజేసింది. సత్యసాయి ప్రేమతత్వం, సేవ, ఆధ్యాత్మిక బోధనలను వివరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఇంజనీర్ బరితెగింపు..!

కాంట్రాక్టర్ కోసం బ్రోకర్ అవతారం

పనులు చేస్తే చుక్కలు చూపిస్తానంటూ బెదిరింపు

ఆందోళనలో టీడీపీ కార్యకర్తలు



అనంతపురం పీఆర్ సబ్ డివిజన్-2 కార్యాలయం



బుక్కరాయసముద్రం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా పనిచేయాల్సిన ఓ ఇంజనీర్ బరితెగించి బెదిరింపులకు దిగుతున్నాడు. ఆయన సామాజిక వర్గానికి చెందిన ఓ క్లాస్ వన్ కాంట్రాక్టర్ కోసం విధి నిర్వహణను పక్కన పెట్టి బ్రోకర్ అవతారమెత్తాడు. ఆ కాంట్రాక్టర్‌కు పనులు ఇప్పించి.. అందిన కాడికి దోచుకోవచ్చని పన్నాగం పన్నాడు. పంచాయతీరాజ్ శాఖలో ఇంత జరుగుతున్నా... ఉన్నతాధికారులు మౌనంగా ఉండిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ పేరుతో సీసీ రోడ్లు మంజూరు చేయడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. శింగనమల నియోజకవర్గంలోని ఓ మండలంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ నిర్వాహకంతో తెలుగు తమ్ముళ్లు నిరాశకు గురవుతున్నారు. గ్రామాల్లో పనులు దక్కించుకున్న టీడీపీ కార్యకర్తలు, నాయకులపై ఆ ఇంజనీర్ పెత్తనం చేస్తున్నట్లు సమాచారం. 'మీకు వచ్చిన పనిని నేను చెప్పిన కాంట్రాక్టర్‌కు ఇవ్వాలి.. మీరే చేస్తే విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో విచారణ జరిపించి బిల్లులు రాకుండా చేస్తా..' అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పనులు చేసేందుకు టీడీపీ నేతలు జంకుతున్నారు.

ఆందోళనలో టీడీపీ శ్రేణులు

అనంతపురం పీఆర్-2 సబ్‌డివిజన్ శింగనమల నియోజకవర్గంలో ఆ ఇంజనీర్ కాంట్రాక్టర్‌గా అవతారమెత్తాడు. తమకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు పనులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తుండడంతో టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. 'అంతా నేనే చూసుకుంటా.. ఎమ్మెల్యేతో కూడా నేనే మాట్లాడుకుంటా.. నేను ఎంతో కొంత కమీషన్ ఇప్పిస్తా' అంటూ పైరవీలు చేస్తున్నాడు. ఆ ఇంజనీర్ సామాజిక వర్గానికి చెందిన ఓ కాంట్రాక్టర్ కోసం ఇదంతా చేస్తున్నట్లు సమాచారం. నష్టమైనా, లాభమైనా తాము పనులు చేస్తే గ్రామాల్లో గౌరవం ఉంటుందని టీడీపీ నేతలు వాపోతున్నారు. బెదిరింపులతో పనులు చేయలేక పోతున్నామని నాయకులు అంటున్నారు. బుక్కరాయసముద్రం మండలానికి రూ. 4.40 కోట్లు, నార్పలకు రూ.3.42 కోట్లు, గార్లదిన్నెకు రూ.3.30 కోట్లు, శింగనమలకు రూ.2.70 కోట్లు, పుట్లూరుకు రూ. 2.20 కోట్లు, యల్లనూరు మండలానికి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో పలు చోట్ల పల్లె పండుగ కింద పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఇంజనీర్ నిర్వాహకంతో ఆ మండలంలో సీసీ రోడ్ల పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.

బెదిరింపులకు భయపడవద్దు

అనంతపురం పీఆర్-2 సబ్ డివిజన్ శింగనమల నియోజకవర్గంలో ఆరు మండలాల్లో ఏ అధికారి బెదిరించినా భయపడవద్దు. నిబంధనల మేరకు సీసీ రోడ్లు వేయవచ్చు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా క్వాలిటీతోనే రోడ్లు వేయిస్తాం. ఎవరన్నా ఇంజనీర్ బెదిరింపులకు దిగితే... మా దృష్టికి తీసుకురండి. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

-అరుణ్‌కుమార్, డీఈ

అర కొర్ర



కోతకు వచ్చిన కొర్రపంట

- తగ్గిన కొర్రపంట దిగుబడి
- భారీగా పడిపోయిన ధర
- రెండు నెలల్లో రూ.ఐదు వేలు పతనం
- ఆందోళనలో రైతులు

ఏ పంట సాగు చేసినా రైతుకు మాత్రం ఆశించిన ఫలితం దక్కడం లేదు. వివిధ రకాల పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు కొర్రసాగు చేస్తే అరకొర దిగుబడి రాగా, ధర భారీగా పడిపోయింది. కొర్రపంట సాగుకు పెట్టుబడి కూడా తక్కువగా ఉండటంతో ఏడాదికేడాది సాగుచేసే రైతుల సంఖ్య పెరుగుతోంది. అయితే ప్రస్తుతం కొర్రపంట దిగుబడి తగ్గడంతో పాటు ధర కూడా భారీగా తగ్గింది. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కొర్ర సాగు రైతులు ఉన్నారు.

- తాడిపత్రి, ఆంధ్రజ్యోతి

ఆరు వేల హెక్టార్లలో కొర్ర సాగు

పెట్టుబడి తక్కువగా ఉండటంతో రైతులు పెద్దఎత్తున కొర్రపంటను సాగుచేస్తున్నారు. ఈ ఏడాది తాడిపత్రి నియోజకవర్గంలో ఆరువేల హెక్టార్లలో కొర్రపంటను సాగుచేశారు. తాడిపత్రి మండలంలో 880హెక్టార్లు, పెద్దపప్పూరు 230హెక్టార్లు, యాడికి 1250హెక్టార్లు, పెద్దవడుగూరు 3470హెక్టార్లు, శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు 18హెక్టార్లు, పుట్లూరులో 226హెక్టార్లలో కొర్రను సాగు చేశారు. ఈ పంట సాగుచేసే సమయంలో ధర ఆశాజనకంగా ఉంది. పంట సాగు కాలం 2నెలల నుంచి 3నెలలు ఉంటుంది. ప్రస్తుతం పంట కోత సమయం వచ్చింది. కానీ ధర మాత్రం అమాంతం పడిపోయింది.



రోడ్డుమీద పంటను ఆరబెట్టిన దృశ్యం

ధర భారీ పతనం

కేవలం రెండునెలల వ్యవధిలోనే కొర్రపంట ధర భారీగా పతనమైంది. క్వింటాకు రూ.5వేలు తగ్గింది. గతేడాది క్వింటా రూ.7వేలు ధర పలికింది. దీంతో ఈ ఏడాది రైతులు కొర్రను భారీ స్థాయిలో సాగు చేశారు. గతేడాది ఎకరాకు 10క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. ఈ ఏడాది జూన్, జూలైలో వర్షాలు రాకపోవడంతో పంట దిగుబడి కూడా తగ్గింది. ఎకరాకు ఐదు క్వింటాళ్ల నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ధర, దిగుబడి తగ్గడంతో కొర్ర సాగు చేసిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. కోత కోసిన పంటను నిల్వ చేసుకోవడానికి వీలులేకపోవడంతో కొందరు రైతులు ఉన్న ధరకే విక్రయిస్తున్నారు. మరికొందరు ఇళ్లవద్ద, గోడౌన్‌లో నిల్వ చేసుకుంటున్నారు. ఏ పంట వేసినా చివరికి నష్టాలే మిగులుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏ పంట సాగుచేసినా నష్టాలే



ధర బాగుందని, పెట్టుబడి తక్కువ అని ఆరు ఎకరాల్లో కొర్రపంట సాగుచేశా. కానీ ప్రస్తుతం ధర పడిపోవడంతో లాభాలు ఆశించినంత స్థాయిలో లేవు. ఏ పంట సాగుచేసినా రైతులకు నష్టాలే తప్ప లాభాలు ఉండటం లేదు. పంట సాగుచేసే సమయంలో ఉన్న ధర కోత కోసే సమయంలో ఉంటేనే రైతులు బాగుపడతారు.

-రామాంజులరెడ్డి, బందార్లపల్లి గ్రామం

పెట్టుబడి తక్కువని సాగుచేశా



పెట్టుబడి తక్కువగా ఉంటుందని నేను మరో రైతుతో కలిసి తొమ్మిది ఎకరాలను కౌలుకు తీసుకొని కొర్రపంట సాగుచేశా. ఎకరాకు రూ.5వేలు కౌలు మొత్తం చెల్లించాను. ఎకరాకు పెట్టుబడి రూ.6వేల నుంచి 7వేల వరకు ఖర్చుచేశా. పంట కోతకు వచ్చేసరికి క్వింటా రూ.2వేలకు పడిపోవడంతో ఏమి చేయాలో అర్థంకావడం లేదు. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో లేదు.

- సుబ్రహ్మణ్యం, కౌలు రైతు గన్నెవారిపల్లికాలనీ

శైవక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు

అనంతపురం కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలకు 300 బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అనంతపురం రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి శ్రీశైలం, మహానంది, పొలతల, లేపాక్షి, అరుణాచలం రూట్లకు ఆదివారం నుంచి బస్సులు నడుపుతామన్నారు. ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవన్నారు. జిల్లాలో ఏదైనా ప్రాంతం లేదా గ్రామం నుంచి 50 మంది చొప్పున బ్యాచులవారీగా బయలుదేరినా వారికి వారి గ్రామానికే బస్సును పంపుతామన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందన్నారు.

డిపోల వారీగా సర్వీసుల వివరాలిలా...






డిపో పేరు	శ్రీశైలం దర్శనం	త్రిలింగ దర్శనం మహానంది శ్రీశైలం ఓంకారం	త్రిలింగ దర్శనం బుగ్గ యాగంటి మహానంది	అరుణాచలం	లేపాక్షి	ఆలూరుకోన	పొలతల
అనంతపురం	24	8	12	6	10	5	5
గుత్తి	-	2	4	-	-	-	-
గుంతకల్లు	12	4	8	2	-	-	-
కళ్యాణదుర్గం	24	4	8	2	-	-	-
రాయదుర్గం	30	4	10	4	-	-	-
తాడిపత్రి	30	8	12	6	-	20	10
ఉరవకొండ	12	4	8	2	-	-	-

నెట్టికంటి ఆలయంలో హనుమద్దీక్షలు



హనుమద్దీక్షల సందర్భంగా ఆంజనేయుడికి పూజలు చేస్తున్న అర్చకులు



దీక్షలు స్వీకరించడానికి కసాపురం దేవస్థానానికి వచ్చిన భక్తులు

గుంతకల్లు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం పలువురు భక్తులు హనుమద్దీక్ష స్వీకరించి హనుమాన్ మాలాధారణ చేశారు. మాల ధరించే భక్తులు వేకువజామునే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో భక్తులకు మాలాధారణ చేసి దీక్షలను ప్రారంభింపజేశారు. దాదాపు 300 మంది భక్తులు మండల దీక్షలను స్వీకరించారు.

ఎదురుచూపు !

సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రైతుల నిరీక్షణ

రబీలో పంట సాగు చేయడానికి సిద్ధం



తనకల్లు వ్యవసాయ కార్యాలయం

తనకల్లు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రబీలో వేరుశనగ పంట సాగు చేయడానికి ప్రభుత్వం పంపిణీ చేసే సబ్సిడీ విత్తనం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే బోరుబావుల కింద పంట సాగు చేయడానికి భూములను సిద్ధం చేసుకున్నారు. వైసీపీ పాలనలో రబీలో రైతులకు సబ్సిడీ పై విత్తన వేరుశనగ ఇచ్చిందే లేదు. అయితే కూటమి ప్రభుత్వమైనా తమ బాధలు తెలుసుకుని సబ్సిడీపై విత్తన వేరుశనగ అందిస్తుందేమోనని రైతులు ఎదురు చూస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిఏటా సబ్సిడీపై మండలంలో రైతులకు రెండువేల క్వింటాళ్లకు పైగా విత్తనకాయలు సరఫరా చేసేది. రబీలో రైతులు పండించిన వేరుశనగ కాయలను స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాల ద్వారా నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయించేది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైతు సంఘాల సమక్షంలో ప్రాసెసింగ్ చేసి, తిరిగి రైతులకు ఖరీఫ్‌లో పంపిణీ చేసేవారు. అలాంటి పరిస్థితిని వైసీపీ పాలనలో కొనసాగించలేదు. ఇప్పుడు మళ్లీ టీడీపీ నేతృత్వంలోనే రాష్ట్రంలో ప్రభుత్వం కొలువుదీరడంతో రబీ విత్తన వేరుశనగపై రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. వ్యవసాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రబీలో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎదురుచూస్తున్నాం



రబీలో గత ఐదేళ్లుగా సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా ఇస్తారేమోనని ఎదురు చూస్తున్నాం. నేను మూడు ఎకరాల్లో వేరుశనగ సాగుచేయడానికి సిద్ధంగా ఉన్నా. గత టీడీపీ పాలనలో ప్రభుత్వమే విత్తనకాయలు సరఫరా చేసేది. రైతులు పండించిన కాయలను ప్రభుత్వమే నేరుగా రైతు సంఘాల ద్వారా గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసేది. ఆ పద్ధతే రైతులకు ఉపయోగకరంగా ఉండేది.

- శ్రీధర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివాండ్లపల్లి

రైతులను ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం రబీలో రైతులకు విత్తన వేరుశనగను సబ్సిడీతో అందించి, ఆదుకోవాలి. వైసీపీ ఐదేళ్ల పాలనలో విత్తనవేరుశనగ ఇచ్చిన పాపాన పోలేదు. ధరలు గిట్టుబాటు కాకపోవడంతో రబీలో కూడా వేరుశనగ సాగు తగ్గిపోయింది. రబీలో విత్తన వేరుశనగ సరఫరా చేసి, రైతులనుంచి రైతు సంఘాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. తద్వారా రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది.

- రమణ, రైతుసంఘం నాయకుడు, తనకల్లు

నాసిరకం విత్తనాలే ఉన్నాయి



ఈఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ దెబ్బతినింది. దీంతో రబీలో సాగు చేయడానికి మార్కెట్‌లో నాసిరకం విత్తనాలే అందుబాటులో ఉన్నాయి. ఈ విత్తనాలతో పంట సాగు చేస్తే రైతులు నష్టపోవాల్సిందే. ప్రభుత్వం సబ్సిడీతో మేలురకం విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు అందించాలి.

- బాలాజీనాయక్, రైతు, బాబేనాయక్ తండా



ఆదేశాలు రాలేదు

ప్రభుత్వం నుంచి ఇంకా రబీ విత్తన వేరుశనగ కోసం ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే మండలాలవారీగా విత్తనకాయల అవసరం గురించి ప్రణాళికలను తయారు చేస్తాం. అనంతరం ప్రభుత్వానికి పంపుతాం.

- సత్యనారాయణ, ఏడీఏ, కదిరి

ఏడు మండలాలనే ప్రకటించడం తగదు

మాజీ మంత్రి సాకే శైలజానాథ్..



మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కరువుకు ఆలవాలమైన అనంతపురం జిల్లాలో ఏడు మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించడం తగదని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్న తీరుకు పొంతన లేదన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులందరికీ న్యాయం జరిగేలా జిల్లాకు చెందిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపాలని కోరారు. కరువు, వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోకుండా ప్రజలను మభ్యపెడుతూ, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పరిమితం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాడులు, దుర్మార్గాలు పెరిగిపోయాయన్నారు. దళితులను పట్టుకెళ్లి గుడిలో దేవుడి ఎదుట చిత్రహింసలు పెట్టినా పట్టించుకొనే నాథుడు కరువయ్యారన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్న మాట మరిచి, మరోసారి పెంచడానికి రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో అరిచే బ్యాచ్ మాత్రమే ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని చూస్తుంటే కరిచే బ్యాచ్ కూడ ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసు, శర్మాస్, ఓబిరెడ్డి, పరమేశ్వర రెడ్డి నిశాంత్‌రెడ్డి, మురళీ పాల్గొన్నారు.

అవినీతి సొమ్మును రికవరీ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి సొమ్మును రికవరీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదల కోసం ఏర్పాటు చేసిన ఉపాధి పథకంలోకి తిమింగలాలు జొరబడ్డాయని విమర్శించారు. గతేడాది జిల్లాలో జరిగిన ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూస్తున్నాయన్నారు. ఉపాధి నిధుల్లో అవినీతికి పాల్పడిన రాజకీయ నాయకులు, వారికి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టి పూర్తి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.5.38కోట్లు పక్కదారి పట్టినట్లు గుర్తించి కేవలం రూ.34లక్షలు రికవరీకి ఆదేశించడమేంటని ప్రశ్నించారు.

ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా యశ్వంతపూర్-ముజఫ్ఫర్‌పూర్ మధ్య అప్ అండ్ డౌన్ ప్రతేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. యశ్వంతపూర్-ముజఫ్ఫర్‌పూర్ ప్రత్యేక రైలు (నెం. 06251) ఈ నెల 4న యశ్వంతపూర్‌లో ఉదయం ఏడున్నరకు బయలుదేరి ఈనెల 6న ఉదయం ఏడున్నరకు ముజఫ్ఫర్‌పూర్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 06252) ముజఫ్ఫర్‌పూర్‌లో ఈ నెల 8న ఉదయం పదిన్నరకు బయలుదేరి ఈ నెల 10న మధ్యాహ్నం 1 గంటకు యశ్వంతపూర్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు ధర్మవరం, డోన్, కర్నూలు సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట్, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, కట్నీ, సాట్నా, ప్రయాగరాజ్, ముఘల్‌సరాయ్, బక్సర్, అర, దానాపూర్, పాటలీపుత్ర, సోన్‌పూర్, హాజీపూర్ మీదుగా గమ్యానికి చేరుతాయన్నారు.

ఎమ్మార్సీలో ఏసీబీ అధికారుల తనిఖీ

కూడేరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో ఏసీబీ అధికారులు శనివారం మరోసారి తనిఖీలు నిర్వహించారు. ఏసీబీ సీఐ హేమంత్ కుమార్‌రెడ్డి సిబ్బంది ఎమ్మార్సీలోని రికార్డులు పరిశీలించారు. ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన చంద్రశేఖర్ సెప్టెంబరు 17న మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాల నుంచి రెండు లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో ఏసీబీ అధికారులు ఆయనపై కేసు నమోదు చేసిన విషయం విదితమే.

8న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 8న నిర్వహించనున్నారు. జడ్పీలోని ప్రధాన సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక సంఘం, వర్క్స్, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య స్టాండింగ్ కమిటీ సమావేశాలు, జడ్పీలోని అదనపు సమావేశ మందిరంలో మహిళ, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు.

నేడు ఉచిత లఘుచిత్ర ప్రదర్శన

అనంతపురం కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భ్రూణహత్యల నివారణపై నిర్మించిన సందేశాత్మక లఘుచిత్రం 'ప్రశ్న'ను ఆదివారం ఉదయం 9 గంటలకు నగరంలోని ఎస్-మాక్స్ థియేటర్‌లో ఉచితంగా ప్రదర్శించనున్నారు. ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో తరిమెల రాజు దర్శకత్వంలో ఈ చిత్రం నిర్మించినట్లు తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్ష కార్యదర్శులు టీవీ రెడ్డి, అల్తాఫ్ శనివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని కళాకారులు, రచయితలు ప్రజలు విచ్చేసి వీక్షించాలని కోరారు.

ఉత్కంఠగా ఎన్నికలు

రసవత్తరంగా సాగిన ఎరువుల డీలర్ల సంఘం ఎన్నికలు

బ్యాలెట్ ద్వారా రహస్య పద్ధతిలో ఓటింగ్

భారీగా హాజరైన ఉమ్మడి జిల్లా డీలర్లు



డీలర్లకు బ్యాలెట్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలైంది. ముందుగా ఒక కౌంటర్‌లో డీలర్‌షిప్ లైసెన్స్, జీఎస్టీ జిరాక్స్ ప్రతులు స్వీకరించి రెండు డాక్యుమెంట్లకు జత చేసి రసీదును అందజేశారు. వాటి ఆధారంగా రెండో కౌంటర్‌లో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీలో ఉన్న ఇద్దరు చొప్పున అభ్యర్థుల బ్యాలెట్ పత్రాలు విడివిడిగా అందజేశారు. సంఘం అధ్యక్ష పదవికి చింతా వెంకటేశ్వర్లు, పార్థసారథి పోటీలో నిలిచారు. ప్రధాన కార్యదర్శి పదవికి భాస్కర్‌రెడ్డి, సిరిగుప్ప వెంకటేశ్వర్లు, కోశాధికారి పదవికి రమేష్ రంగయ్య, వెంకటేష్ బాబులు పోటీపడ్డారు. బ్యాలెట్ పత్రాలు అందజేసిన తర్వాత మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల దాకా రహస్య పద్ధతిలో పోలింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు పోటీదారుల సమక్షంలో కౌంటింగ్ నిర్వహించారు. ఆ తర్వాత ఫలితాలు ప్రకటించారు. కౌంటింగ్ సమయంలో పోటీలోని అభ్యర్థులతోపాటు డీలర్లలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా చింతా వెంకటేశ్వర్లు

ఉమ్మడి జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చింతా వెంకటేశ్వర్లు గెలుపొందారు. ఆయనకు 629 ఓట్లు రాగా. పార్థసారథికి 89 వచ్చాయి. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీలో ఉన్న భాస్కర్‌రెడ్డికి 360 ఓట్లు రాగా, సిరిగుప్ప వెంకటేశ్వర్లుకు 356 ఓట్లు వచ్చాయి. కోశాధికారి పదవికి పోటీలో ఉన్న రమేష్ రంగయ్యకు 366 ఓట్లు రాగా, వెంకటేష్ బాబుకు 353 ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడిగా చింతా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా రమేష్ రంగయ్యలు గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా గంగాధర్, సీకే రవి, కార్యదర్శులుగా అమర్‌నాథ్‌రెడ్డి, ముజీత్‌ఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఇతర నాయకులు, డీలర్లు శాలువ కప్పి, పూల మాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులకు సత్కారం

ర్పూరం ఘటనపై
కదలిక


వైద్యులు, కుటుంబ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాధితులను పరామర్శించిన కలెక్టర్
మెరుగైన చికిత్సపై కుటుంబ సభ్యులకు భరోసా

అనంతపురం టౌన్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): కర్పూరం ఫ్యాక్టరీలో శుక్రవారం జరిగిన ప్రమాదం పట్ల జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. శింగనమల మండలంలోని కర్పూరం ఫ్యాక్టరీలో శుక్రవారం ఉదయం రియాక్టర్ శుభ్రం చేయడానికి వెళ్లి ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఫ్యాక్టరీ యాజమాన్యం గుట్టుచప్పుడు


బాధితుడు హరిని పరామర్శిస్తున్న కలెక్టర్

కాకుండా బాధితులను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తర్వాత ఆ ఫ్యాక్టరీ ప్రతినిధులు గానీ సంబంధిత అధికారులు గానీ వారిని పట్టించుకోలేదన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో స్పందించిన కలెక్టర్ శనివారం ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, ప్రమాదం జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, అధికారులు, బాధిత కుటుంబసభ్యులతో కలెక్టరు ప్రత్యేకంగా ఆస్పత్రిలోనే సమావేశమయ్యారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని ఆదేశించారు. డీఎంహెచ్ఓ అక్కడే ఉంటూ పర్యవేక్షించాలని ఆదేశించారు. బాధితులు వైద్య ఖర్చుల గురించి ఆందోళన చెందాల్సిన పని లేదని, అంతా ఫ్యాక్టరీ యాజమాన్యమే భరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైన సమస్య వస్తే శింగనమల తహసీల్దార్‌కుగానీ, లేదా నేరుగా తనకే తెలియజేయవచ్చని భరోసా ఇచ్చి ఫోన్ నెంబర్లు కూడా ఇచ్చారు.

బాధితులంతా సేఫ్

కర్పూరం ఫ్యాక్టరీలో అస్వస్థతకు గురైన ఆరుగురు ఆరోగ్యంగా ఉన్నారని, ఎలాంటి ప్రమాదంలేదని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. బాధితులను పరామర్శించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. సప్తగిరి కర్పూరం ఫ్యాక్టరీలో శుక్రవారం ఉదయం 9గంటల సమయంలో రియాక్టర్‌లోకి దిగిన కార్మికులు ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురికాగా 10-15 గంటలకు వారిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారన్నారు. బాధితుల్లో ఒకరి ఆరోగ్య పరిస్థితి మధ్యాహ్నానికే కుదుటపడటంతో డిశ్చార్జ్ అయ్యి వెళ్లిపోయినట్లు తెలిపారు. నాగేంద్రప్రసాద్, కృష్ణ, లక్ష్మీనారాయణ, సారయ్య, హరినాథ్‌బాబు ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. వీరిలో ముగ్గురు ఆరోగ్యంగా ఉండటంతో సాధారణ వార్డుకు తరలించారన్నారు. మిగిలినవారి పరిస్థితి కూడా బాగా మెరుగవుతోందని తెలిపారు. బాధితుల వైద్యఖర్చులను మొత్తం ఫ్యాక్టరీ యాజమాన్యమే భరించాలిని ఆదేశించినట్లు తెలిపారు. ఇంటికి వెళ్లిన తర్వాత కూడా డాక్టర్ల పర్యవేక్షణ చేయాలని, అపుడు కూడా వారికి ఎలాంటి చికిత్స కావాలన్నా అందించాలని ఆదేశించామన్నారు. ఇప్పటికే ఈ ఘటనపై విచారణకు అధికారుల బృందాన్ని పంపామని, వారిచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదంపై విచారణ
కర్పూరం ఫ్యాక్టరీని తనిఖీ చేసిన విచారణ బృందం


ఘటనా స్థలాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

శింగనమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వద్ద ఉన్న సప్తగిరి కర్పూరం ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై కలెక్టర్ నియమించిన విచారణ బృందం అధికారులు శనివారం విచారణ చేపట్టారు. అనంతపురం ఆర్డీఓ వసంతబాబు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వి.శ్రీనివాసులురెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ మునీప్రసాద్, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య, పరిశ్రమల శాఖ డీఎస్పీ వెంకటేశులు, పరిశ్రమలశాఖ ఇన్‌స్పెక్టర్ కేశవయ్య, భూగర్భ జలశాఖ అధికారులు దాదాపు రెండు గంటల సేపు విచారణ చేపట్టారు. మొదట యాజమాన్యంతో ఫ్యాక్టరీకి సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ప్రమాదం జరిగిన తీరుపై అక్కడి కార్మికులతో వివరాలు సేకరించారు. తర్వాత ప్రమాదం జరిగిన ఆర్-3 రియాక్టర్ వద్దకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్య , ఎస్ఐ శరత్ చంద్ర పాల్గొన్నారు.

ఆక్సిజన్ అందకపోవడం వల్లే: వసంతబాబు, ఆర్డీఓ

సప్తగిరి కర్పూరం ఫ్యాక్టరీలో ఆర్-3 రియాక్టర్‌ను మరమ్మతులు చేస్తుండగా ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురైన విషయం వాస్తవమే. ప్రస్తుతం వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కలెక్టర్ విచారణ కమిటీ వేయగా వచ్చి పరిశీలించాం. రియాక్టర్‌లో మరమ్మతులు చేయడానికి వెళ్లినవారికి ఆక్సిజన్ అందక అస్వస్థతతో పడిపోయారు. వారికి బయటికి తీయడానికి మరో నలుగురు కార్మికులు వెళ్లగా వారు కూడ అస్వస్థతకు గురయ్యారని సంఘటన స్థలాన్ని తనిఖీ చేశాక అర్థం అవుతోంది. మా నివేదికను కలెక్టర్ పంపుతాం. ప్రమాదానికి ఎలాంటి విషవాయువులు వెలువడలేదని తెలుస్తోంది.

ప్రియుడే హంతకుడు
మహిళ హత్య కేసు ఛేదింపు



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్ల గ్రామానికి చెందిన మెహతాజ్‌ను ప్రియుడు ఇర్ఫాన్ బాషా హత్య చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. తనను కాదని మరొకరితో చనువుగా ఉందన్న అనుమానంతోనే ప్రియుడు చంపేసినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో నిందితుడు ఓబుళదేవరచెరువు మండలం డబురువారిపల్లికి చెందిన ఇర్ఫాన్‌బాషాను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు ఛేదింపు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఇర్ఫాన్‌బాషాతో మెహతాజ్ చనువుగా ఉండేది. ఆమె ఇటీవలిగా మరొకరితో చనువుగా ఉంటోందని ఇర్ఫాన్‌బాషా అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. గతనెల 31వ తేదీన ఆమె కొండకమర్లలోని తల్లితండ్రుల ఇంటికి వచ్చిందని తెలుసుకుని రాత్రి 11.30 గంటల సమయంలో ఇర్ఫాన్ బాషా ఫోన్ చేశాడు. మిద్దెమీదకు రావాలనీ, మాట్లాడాలని చెప్పాడు. ఆమె మిద్దెమీదకు రాగానే వేరొకరితో సంబంధం ఉందంటూ నిలదీశాడు. అలాంటిదేమీ లేదని ఆమె చెప్పుకొచ్చింది. మాటామాటా పెరిగి, ఆమె గొంతు నులిమి ఇర్ఫాన్ బాషా హత్య చేశాడు. దీనిపై మృతురాలి తండ్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని, పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడిని శనివారం పోలీసులు ఓబుళదేవరచెరువు మండలం గాజుకుంటపల్లి బస్టాప్ వద్ద అరెస్టు చేశారని ఎస్పీ వెల్లడించారు. సమావేశంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఓబుళదేవరచెరువు ఎస్ఐ మల్లికార్జునరెడ్డిపాల్గొన్నారు.

సరిహద్దులో నేరాలను అరికట్టాలి: ఎస్పీ రత్న


జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దులో నేరాలను అరికట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. డీపీఓలోని తన చాంబర్ నుంచి సరిహద్దు పోలీసుస్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. సరిహద్దులో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమరవాణా నివారణకు పటిష్ట నిఘా ఉంచాలన్నారు. జూదం, గంజాయి, మట్కా, అక్రమ మద్యం కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీసులు తరచూ గ్రామాలను సందర్శిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.

బీజేపీ నాయకుడిపై వైసీపీ మూకల దాడి


గాయపడిన సతీశ్

ముదిగుబ్బ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని సిరిగారిపల్లిలో వైసీపీ మూకలు రెచ్చిపోయారు. బీజేపీ నాయకుడు సతీశ్‌పై దాడికి తెగబడ్డారు. పట్నం ఏఎస్ఐ లోకనాథ్ తెలిపిన వివరాల మేరకు... సతీశ్‌తో అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రెడ్డిబాబు, రాధాకృష్ణకు గతం నుంచి గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సతీశ్ ఫోన్‌లో మాట్లాడుతుండగా రెడ్డిబాబు, రాధాకృష్ణ వచ్చి, నానా దూర్భాషలాడారు. మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. సతీశ్‌పై రెడ్డిబాబు, రాధాకృష్ణ రాయితో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. సతీశ్‌ను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

యల్లనూరు/తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం యల్లనూరులోని చెరువుకట్ట వద్ద శనివారం 212 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు. యల్లనూరు మద్యంషాపు నుంచి మద్యం బాటిళ్లు తీసుకువెళుతున్నట్లు సమాచారం రావడంతో దాడిచేశామన్నారు. ఈ దాడిలో శింగవరం గ్రామానికి చెందిన రామాంజనేయులు, కోడిమూర్తి గ్రామానికి చెందిన వీరాంజనేయులును అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె క్రాస్ వద్ద మద్యం విక్రేత రాజమ్మను అరెస్ట్‌చేసి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు.

స్కూల్ కరస్పాండెంట్‌పై దాడి

తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న సూర్య హైస్కూల్ కరస్పాండెంట్ దూదేకుల బాబయ్యపై కిరణ్‌తోపాటు మరికొందరు దాడిచేసి గాయపరిచినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన కిరణ్‌తోపాటు మరికొంతమంది ఓపెన్ ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ కోసం స్కూల్ వద్దకు వెళ్లి అడిగారు. వాటిని ఇవ్వకపోవడంతో మాటమాట పెరిగి అతడిపై దాడిచేయడంతో తలకు, ముఖంపై రక్తగాయాలయ్యాయని తెలిపారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఉరవకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని అనంతపురం రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజి(22) అనే యువకుడు మృతి చెందాడు. ఉరవకొండకు చెందిన అంజి, నరసింహులు, సాయి ద్విచక్రవాహనంలో అనంతపురం వైపు వెళ్తుండగా ఉరవకొండ సమీపంలోని రాములమ్మ గుడి వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొనడంతో అంజికి తలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన అంజి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ తెలుసుకుని వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల సొమ్ము స్వాహా..!
వేలిముద్రలు వేయించుకుని డబ్బు ఇవ్వని వైనం
సింగనహళ్లిలో సచివాలయ ఉద్యోగి చేతివాటం

బొమ్మనహాళ్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వేలిముద్రలు వేయించుకుని వృద్ధులకు, వికలాంగులకు పింఛన్ డబ్బులు ఇవ్వకుండా స్వాహా చేసిన ఓ సచివాలయ ఉద్యోగి నిర్వాకం బొమ్మనహాళ్ మండలంలోని సింగానహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. గోనేహాళ్ గ్రామ సచివాలయ ఉద్యోగి రమేష్ సింగానహళ్లిలో దాదాపు 15 మంది పింఛన్‌దారుల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయించుకున్నాడు. డబ్బులు మళ్లీ వచ్చి ఇస్తానని రెండురోజులైనా ఇవ్వలేదని గ్రామానికి చెందిన పక్కీరమ్మ, రుద్రమ్మ, భాగ్యమ్మ, మారెక్క, హెచ్.కెంచప్ప, వండ్రక్క, హెచ్. దానప్ప, ఆంజనేయులు, గిడ్డ కెంచప్ప తెలిపారు. ఆ గ్రామానికి చెందిన పూర్తి దివ్యాంగుడు మంచంపై ఉంటున్న శివప్పతో వేలుముద్రలు వేయించుకుని రూ. 15 వేలు ఇవ్వలేదు. ప్రభుత్వం ఇచ్చే పింఛనే తమకు ఆధారమని వాటితోనే మందులు వంటివి కొనుగోలు చేస్తామని బాధితులు వాపోయారు. ఈ సచివాలయ ఉద్యోగి గతంలో కూడా ఇలాగే చేశాడని గ్రామస్తులు చెప్పారు. అధికారులు పర్యవేక్షణ లేని కారణంగా పింఛన్ డబ్బులు వాడుకుంటున్నారని తెలుస్తోంది. సచివాలయ ఉద్యోగితో తమకు పింఛన్ డబ్బులు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.


డబ్బు ఇవ్వలేదని చెబుతున్న వృద్ధులు

విచారించి.. చర్యలు తీసుకుంటాం

శింగనహళ్లిలో వేలిముద్రలు వేయించుకుని పింఛన్ల డబ్బులు ఇవ్వని విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై సచివాలయ ఉద్యోగిపై ఫిర్యాదులు కూడా వచ్చాయి. విచారించి చర్యలు తీసుకుంటాం. ఆదివారం పింఛన్ డబ్బులు అందించేలా చర్యలు తీసుకుంటాం.

- దాస్ నాయక్, ఎంపీడీఓ


దివ్యాంగుడు శివప్ప

వర్సిటీ ఆదేశాలను పాటించాల్సిందే
ఫార్మసీ కళాశాలలను హెచ్చరించిన జేఎన్‌టీయూ వీసీ

అనంతపురం సెంట్రల్, నవబంబరు 2(ఆంధ్రజ్యోతి): వర్సిటీ ఆదేశాలను పాటించకపోతే చర్యలు తప్పవని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఫార్మసీ కళాశాలల అధికారులను హెచ్చరించారు. జేఎన్‌టీయూ అనుబంధ ఫార్మా-డీ కళాశాలల అధికారులతో ఆయన శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై చర్చించారు. ఫార్మసీలో పరిశోధనలపై దృష్టిపెట్టాలని ఈ సందర్భంగా వీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్యతోపాటు కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.


ఫార్మసీ కళాశాలల అధికారులతో వీసీ సుదర్శన రావు


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్తీక మాసం కావడంతో భక్తులు పెన్నానదిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.

రికార్డు సృష్టిస్తాం
శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం

అనంతపురం విద్య, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మ్యాథ్స్ ఫార్ములాలతో ఈ ఏడాది రికార్డు సృష్టిస్తామని శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలోనే జిల్లా నుంచి అత్యధికంగా తమ పాఠశాలల విద్యార్థులు లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. శ్రీచైతన్య సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులను శనివారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జిల్లా నుంచి 22 మంది శ్రీచైతన్య విద్యార్థులు మాస్టర్ మైండ్స్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థులకు ప్రత్యేకంగా కో-ఆర్డినేటర్ల ద్వారా శిక్షణ ఇప్పించామన్నారు. ఈనెల 6న 668 మ్యాథ్స్ ఫార్ములాలతో ప్రపంచ రికార్డ్స్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కరీముల్లా, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.


మాస్టర్ మైండ్స్ ప్రోగ్రాం విద్యార్థులతో ఏజీఎం సుబ్బారెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, పీడీలు

గుత్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి జట్టు క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఉష తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో తొమ్మిదో తరగతి నవ్య, పదో తరగతి చదువుతున్న స్వాతి అనే విద్యార్థినులు వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను హెచ్ఎంతో పాటు పీడీలు సరోజ, శకుంతల, శ్యామల అభినందించారు.

ప్రినిపాల్‌గా విష్ణువర్ధన్


ప్రొఫెసర్ విష్ణువర్ధన్

అనంతపురం సెంట్రల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పులివెందుల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ విష్ణువర్ధన్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల డిప్యూటీ ఎగ్జామినేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. స్పాన్సర్ రీసర్చ్ డైరెక్టర్‌గా ఈశ్వరరెడ్డి, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పద్మసువర్ణను నియమించారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆదేశాలతో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

టమోటా కిలో రూ.30



అనంతపురం రూరల్, నవంబరు 2(ఆంధ్ర జ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.16 పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లి రిజర్వాయర్‌లో
నీటి నిల్వ 1.658 టీఎంసీలు

బెళుగుప్ప, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 1.658 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1039 క్యూసెక్కులు వుండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1068 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

ఆక్రమిస్తా.. నా ఇష్టం..
తొలగించాలని చూస్తే ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు పెడతా
అధికారులకు వైసీపీ నాయకుడి బెదిరింపులు

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు బరితెగించాడు. ఏకంగా రోడ్డునే ఆక్రమించి, బండలు పాతాడు. ఇది సరికాదనీ, వెంటనే బండలు తొలగించుకోవాలని సూచించిన అధికారులనే బెదిరించాడు. బండలు తొలగించాలని చూస్తే ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు పెడతానన్నాడు. దీంతో వారు అవాక్కయ్యారు. వారిని తీవ్రంగా దూషిస్తూ దాడి చేసినంత పని చేశారు. దీంతో వారు అక్కడినుంచి వెళ్లిపోయారు.

అధికార భ్రమలోనే..

వైసీపీ అధికారం కోల్పోయి ఐదునెలలు దాటినా ఇంకా ఆ పార్టీ నాయకులు అధికార భ్రమలో ఉన్నట్లుంది. ఇప్పటికే పేదల స్థలాలను ఆక్రమించుకుని, స్వాహా చేశారు. అది చాలదన్నట్లు ప్రస్తుతం రోడ్లను సైతం వదలడంలేదు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో మాజీ కౌన్సిలర్, వైసీపీ నాయకుడు రామయ్య ఏకంగా డ్రైనేజీని, ఆ తరువాత మరింత రోడ్డును ఆక్రమించి, బండలు పాతేశాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ పట్టణ ప్రణాళికాధికారి (టీపీఓ) సాయిప్రసాద్, సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించారు. డ్రైనేజీతోపాటు రోడ్డును సైతం అక్రమించినట్లు నిర్ధారించారు. ఆక్రమిత స్థలంలో నాటిన బండలను తొలగించుకోవాలని టీపీఓ.. రామయ్యకు సూచించారు. దీంతో రామయ్య రెచ్చిపోయాడు. 'రోడ్డంతా ఆక్రమిస్తా, ఏం చేసుకుంటారో చేసుకోండి. ఎక్కువ మాట్లాడితే మీపైనే కాదు, మీ కమిషనర్‌పై కూడా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిస్తా. నేనంటే ఏమనుకున్నారో.. జాగ్రత్త..' అంటూ సిబ్బందిపై చిందులు తొక్కాడు. భౌతికదాడులకు ఎక్కడ దిగుతాడోనన్న భయంతో సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోక తప్పలేదు. దీనిపై టీపీఓ సాయిప్రసాద్ మాట్లాడుతూ.. రోడ్డును ఆక్రమించి, నాటిన బండలను తొలగించుకోమన్నందుకు రామయ్య దుర్భాషలాడాడన్నారు. విషయాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని టీపీఓ వెల్లడించారు.


డ్రైనేజీతోపాటు రోడ్డును సైతం ఆక్రమించిన దృశ్యం

ఘనంగా వీరదిమ్మమ్మ, భైరవస్వాముల జాతర



పూజల్లో పాల్గొన్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చిన్నూరు రోడ్డు వంక వద్ద శనివారం నిర్వహించిన నాగులబావి గంగమ్మతల్లికి వీరదిమ్మమ్మ, శ్రీభైరవస్వాముల జాతరను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జన సేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో 9వ వార్డు జనసేన ఇన్‌చార్జ్ కొండా దుర్గమ్మ, నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్ పాల్గొన్నారు.



గుండు ఎత్తుతున్న యువకుడు

ముగిసిన లక్ష్మీకటాక్షసిద్ధి హోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

తాడిమర్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న లక్ష్మీకటాక్షసిద్ధి, నిత్యాగ్ని హోమాలు శనివారం ముగిశాయి. మహాయోగిని రమ్యాదేవి, శివానంద స్వామి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ప్రజలందరూ అష్టయిశ్వర్యాలతో సుఖంగా జీవించాలని హోమం నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. పూర్ణాహుతి సందర్భంగా లక్ష్మీదేవికి చీరసారె సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. చౌడేశ్వరీదేవి ఆలయ కమిటీ నిర్వాహకుడు గోవర్దన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు ఎంపిక



ఎంపికైన ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): హాకీ ఇండియా ఆధ్వర్యంలో 4 నుంచి 16వ తేదీ వరకు చెన్నైలో జరిగే 14వ పురుషుల జాతీయ సీనియర్ హాకీ పోటీలకు ఏపీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు వైస్ ప్రెసిడెంట్ బంధనాధం సూర్యప్రకాశ్ తెలిపారు. జూన్‌లో ఇక్కడ జరిగిన 14వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల పోటీల్లో సత్యసాయిజజిల్లా హాకీ జట్టు రెండవస్థానంలో నిలిచింది. ప్రతిభ కనబరచిన హరీశ్, వెంకటేశ్‌నాయక్, రాజేశ్ రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించారన్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్‌గా ధర్మవారినికి చెందిన హస్సేన్ వ్యవహరించనున్నారు. ఎంపికైన వారిని వైస్ ప్రసిడెంట్‌తోపాటు సభ్యులు అభినందించారు.

రైతులకు కషాయాల పంపిణీ



రైతులకు కషాయాలను అందజేస్తున్న వాసన్ సంస్థ ప్రతినిధులు

తనకల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగసాని పల్లి, ముత్యాలవారిపల్లి, బండివారిపల్లి గ్రామాల రైతులకు శనివారం వాసన్‌సంస్థ ఆధ్వర్యంలో కషాయాలను పంపిణీ చేశారు. పంచగవ్వ, యానిక్‌యాసిడ్, కషాయాలను ఎంటర్‌ప్రిన్యూర్ వద్ద తయారు చేయించి అందించారు. రైతులు తాము సాగుచేసిన పంటల్లో పెట్టుబడులు తగ్గించి, ఆదాయం పొందడానికి ఈకార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. తవళం కార్యదర్శి రాజశేఖర్‌నాయక్, వాసన్ సంస్థ ప్రతినిధి శీనప్ప, ఎంటర్‌ప్రిన్యూర్ శంకర్‌రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంటు చిన్నిక్రిష్ణ రైతులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎంపిక



మాట్లాడుతున్న బడా సుబ్బిరెడ్డి

నంబులపూలకుంట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యవర్గ సమావేశం శనివారం రైతు సంఘం మాజీ అధ్యక్షుడు గంగిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు బడా సుబ్బిరెడ్డి హాజరయ్యారు. అనంతరం మం డల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యదర్శి రాజారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా మహాసభ ప్రతినిధిగా నాగరాజు, సభ్యులుగా గంగిరెడ్డి, మల్లిరెడ్డి, రమణప్పను ఎన్నుకున్నారు.

వృద్ధుడి అదృశ్యం



కేశవరెడ్డి (ఫైల్)

గాండ్లపెంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీలోని ముగనలవారిపల్లికి చెందిన కేశవరెడ్డి(77) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఏఎస్ఐ రంగా శనివారం తెలిపారు. మునగలవారిపల్లికి చెందిన కేశవరెడ్డి 15రోజు నుంచి కనిపించలేదని కుమారుడు రెడ్డిబాబు శనివారం ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు గాండ్లపెంట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

కదిరి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టిపల్లి గ్రామ శివారు ప్రాంతాల్లో పేకాటస్థావరంపై శనివారం దాడిచేసినట్లు సీఐ మోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారినుంచి 7 సెల్ ఫోన్లు, 13 ద్విచక్రవాహనాలు, రూ.1,03,330 స్వాధీనం చేసుకున్నామన్నారు. మరికొంతమంది పారిపోయినట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా జాగృతికే న్యాయ సదస్సులు

● న్యాయాధికారి జయలక్ష్మి



మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

కదిరి లీగల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మహిళలు మోసపోకుండా జాగృతం చేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, న్యాయాధికారి జయలక్ష్మి తెలిపారు. అక్టోబరు 5న ఈ ప్రక్రియ నల్లమడలో ప్రారంభమైనట్లు చెప్పారు. అందులో భాగంగా 16, 23వ తేదీల్లో తలుపుల, కదిరిరూరల్ మండలాల్లో సదస్సులను నిర్వహిస్తామన్నారు. ఉన్నత న్యాయస్థానం, హైకోర్టు, జిల్లా కోర్టుల ఆదేశాల మేరకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు శనివారం సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎం రాధిక, రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు సీ భానుజా, న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, గురులింగస్వామి పాల్గొన్నారు. విధాన్సే సమాధాన్ ద్వారా మహిళా చైతన్య సదస్సుల ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. మిగిలిన మండలాల్లో కూడా మార్చి 31వ తేదీలోగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రత్యేకించి గృహహింస, వరకట్న వేధింపులు మహిళల అపహరణ, అక్రమ రవాణా, యాసిడ్‌దాడులు, మానభంగాలు, సమానపనికి సమాన వేతనం, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న అంశాలపై కూడా సదస్సులలో చర్చిస్తామన్నారు. మహిళలు మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే న్యాయ విజ్ఞాన సదస్సుల ఆవశ్యకత అన్నారు. ప్రధానంగా మహిళల చట్టాలను వివరించి మేల్కొల్పడం ఇందులో భాగమేనన్నారు. మహిళ చైతన్యవంతురాలు అయినప్పుడే కుటుంబం, సమాజం సౌభాగ్యవంతంగా ఉంటుందన్నారు. ఎంతో ఉన్నత ఆశయాలతో సాగే సదస్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సభ్యత్వంలో ప్రథమస్థానంలో నిలుపుదాం

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి, పక్కన పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం చేయించడంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమష్టి కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 100శాతం పార్టీ సభ్యత్వాన్ని చేపట్టాలన్నారు. పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు బీమా భరోసా ఉంటుందన్నారు. ప్రతి గ్రామం, వార్డుల్లో పర్యటించి సభ్యత్వ నమోదు చేయాలనిసూచించారు. వంద రూపాయల సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



చేతిపంపునకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

నంబులపూలకుంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముండ్లవారిపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు పరిషరిఇంచారు. ముండ్లవారిపల్లిలో తాగునీటి ఎద్దడి అనే కథనం శనివారం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ ఆంజనప్ప, ఈఓఆర్డీ మాధవరెడ్డి ముండ్లవారిపల్లిలో చేతిపంపునకు మరమ్మతు చేయించారు. తాగునీటి బోరుకు ఏర్పాటు చేసిన డీపీని మరమ్మతు కోసం తరలించారు.

పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి

పుట్టపర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని వైఎస్ఆర్ క్రాంతి పథం ఎల్1, ఎల్2 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశ్వత్థరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్నిశాఖల ఉద్యోగులకు పదవీవిరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచారని, కాంత్రిపథంలో పనిచేస్తున్న వారికి జీఓను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. మోహన్‌రెడ్డి, శంకర్, మునిరెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ముదిగుబ్బ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎన్‌డీఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలపై అవగాహన వారోత్సవాలలో భాగంగా శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఏపీజీబీ మేనేజర్ సాగర్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన చందు, స్రవంతి, కుసుమలకు బహుమతులుఅందజేశారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు శివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, బ్యాంకు సిబ్బంది లక్ష్మీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



పూడికతీత పనులు చేయిస్తున్న రైతులు

బుక్కపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే అతి పెద్ద చెరువైన బుక్కపట్నం చెరువుకు పూర్తిస్థాయిలో నీరుచేరాయి. దీంతో రైతులు శనివారం కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. రైతుల పంట పొలాల కాలువల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఎక్స్‌కవేటర్ల సాయంతో వాటిని తొలగించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆదేశాల మేరకు పనులు ప్రారంభించినట్లు రైతు సంఘం అధ్యక్షుడు సంజీవరాయుడు తెలిపారు. రైతులు, మాజీ ఎంపీపీ బాలు, నాగభూషణం, ఆదినారాయణ, కోనా కేశప్ప, ఎర్రన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీతోనే తెలుగువారికి భవిష్యత్తు

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): తెలుగువారి భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలో జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప, ఎమ్మెల్యే సభ్యత్వనమోదును ఎమ్మెల్యే నివాసంలో ప్రారంభించారు. పార్టీ ఆదేశం మేరకు రూ.లక్షతో శాశ్వత సభ్యత్వం, రూ.100తో సాధారణ సభ్యత్వం చెల్లించి, రూ.ఐదు లక్షల ప్రమాద బీమా, తక్షణసాయంగా రూ.పదివేలు లబ్ధి పొందే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డైమండ్ ఇర్ఫాన్, బాహుద్దీన్, మండలాధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జి, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అటవీ సంపదపై విద్యార్థులకు అవగాహన

నల్లమాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పర్యావరణ, అటవీసంపదపై విద్యార్థులకు భాస్కర్‌నాయుడు అవగాహన కల్పించారు. ఆయన మాట్లడుతూ.. ఈప్రాంతంలో సహజవనరులైన అడవులు, చెట్లు విరివిగా ఉన్నాయన్నారు. వేసవి కాలంలో అగ్నికి ఆహుతికాకుండా కాపాడుకోవాలన్నారు. అలాచేస్తే వర్షాలు బాగా కురుస్తాయన్నారు. ప్రతి విద్యార్థి వారి వారి సమీపంలోని అడవులకు నిప్పు పెడితే సమాచారం అందించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధి బాధితుడి వద్దకే పింఛన్

నల్లమాడ నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగంపల్లి పంచాయతీ బొగ్గిటివారిపల్లి క్వాటర్సుకు చెందిన జెరిపిటి కిష్టప్ప గత నెలలో గుండెజబ్బుతో బాధపడుతూ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి మస్తాన్‌చొరవతో సచివాలయ సాంకేతిక అధికారిని జబిన్‌తాజ్‌ను అనంతపురం ఆసుపత్రికి పంపి, లబ్ధిదారునికి పింఛన్ అందించారు. ఉద్యోగిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెర ఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ రాబర్టు విల్సన్ అభినందించారు.

14న ప్రజావేదిక

నంబులపూలకుంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో 2023-24లో చేసిన పనులకు సోషల్ ఆడిట్ బృందం పనులను పరిశీలిస్తున్నారు. 14వ తేదీన ప్రజావేదిక నిర్వహించనున్నట్ల ఎంపీడీఓ అంజనప్ప తెలిపారు. ఈవేదికకు కూలీలు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలన్నారు.

అండర్‌బ్రిడ్జి కింద నీటిని తొలగించండి



అండర్ బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ అండర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలవకుండా చూడాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం అండర్ బ్రిడ్జి వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎక్కువ కాలం వర్షపు నీరు నిల్వఉండటంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఈ విషయంపై మున్సిపల్, ఆర్డీఓ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. సమస్యను పరిష్కరించపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి నాగార్జున, హరి, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

బుక్కపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పేట వీధి రామాలయం పునఃనిర్మాణం కోసం గ్రామానికి చెందిన ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి నాగేశం రూ.51,116 విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్‌కు శనివారం అందించారు. దాత మాట్లాడుతూ.. గ్రామంలో రోడ్డు విస్తరణలో పురాతన దేవాలయాన్ని కూల్చగా.. జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం కావడంతో తనవంతుసాయం అందించానన్నారు.

12 గంటలకే సచివాలయం ఖాళీ

కదిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ సచివాలయం శనివారం మధ్యాహ్నం 12 గంటలకే ఖాళీ అయింది. ఒక్క ఉద్యోగి కూడా కార్యాలయంలోలేరు. పింఛన్ కోసం వచ్చిన ఓ వృద్ధురాలు అక్కడే పడిగాపులు కాసింది. ఎవరు ఎక్కడికి వెళ్లారో తెలిపే మూమెంట్ రిజిష్టర్‌లోకూడా వివరాలు లేవు. కార్యాలయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వచ్చినవారు చూసి వెళ్లిపోవడం తప్ప ఏమి చేయలేని పరిస్థితి. దీనిపై మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌ను వివరణకోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాళీగా ఉన్న 22వ సచివాలయం



పింఛన్‌కోసం వేచి ఉన్న వృద్ధురాలు



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రగతి నివేదికను సిద్ధం చేయండి

● కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు నెలలుగా చేపట్టిన ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు రోజుల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యప్రకాశ్ జిల్లా పర్యటనకు వస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా లో చేపట్టిన అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షిస్తారని, ఇందుకు ఆయా శాఖల అధికారులు ముందస్తు నివేదికలను సిద్ధం చేసుకోవాలన్నారు. పర్యటన విజయవంతం చేయడానికి సమష్టికృషి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ విజయసారథి, ఆర్డీఓ సువర్ణ సీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన పరిటాల శ్రీరామ్



చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడుకు పరిటాలశ్రీరామ్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో బీఆర్ నాయుడు కార్యాలయానికి వెళ్లి ఆయనను నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

పవన్ కళ్యాణ్ ఫొటో ఎక్కడ?

● అధికారులను నిలదీసిన జనసేన నాయకులు



ఫ్లెక్సీలో కనబడని పవన్‌కళ్యాణ్ ఫొటో

పెనుకొండ టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గుంతల రహిత రోడ్డు కార్యక్రమాన్ని పెనుకొండలో ఆర్అండ్‌బి అధికారుల సమక్షంలో చేపట్టారు. ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫొటో లేకపోవడంతో జనసేన నాయకులు, కార్యకర్తలు మా పవన్‌కళ్యాణ్ ఫొటో ఎక్కడ? అంటూ ఆర్అండ్‌బి అధికారి వెంకటనారాయణరెడ్డిని నిలదీశారు. కొద్దిసేపు వాగ్వాదాలు జరిగాయి. అక్కడే ఉన్న టీడీపీ నాయకులు కలగజేసుకుని సర్దిచెప్పారు. ఇలాంటి పొరపాట్లు తిరిగి పునరావృతం కావని అధికారులు జనసేన నాయకులకు తెలిపారు.

న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

● 8వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

హిందూపురం అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ముక్కిడిపేటలోని బాయ్స్ ఎస్సీ హాస్టల్‌లో ల్యాండ్ సర్వేయింగ్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లలో ఉచిత శిక్షణ అందించి ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్లు కూడా ఇస్తామన్నారు. అదే విధంగా గుర్తింపు పొందిన ప్రముఖ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగాలు కూడా ఇప్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 16సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 8వ తేదీలోపల పంపించాలని తెలిపారు. ల్యాండ్ సర్వేయింగ్‌కు దరఖాస్తు చేసుకునే వారు ఇంటర్ పూర్తి చేసి ఉండాలన్నారు. ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ శిక్షణ పొందేవారు పదో తరగతి పూర్తి చేసి ఉండాలని తెలిపారు. వివరాలకు 9052901657, 9110550779 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్యాన్సర్ బాధితుడికి పరామర్శ



గొల్ల శ్రీరాములును పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రయ్యగారిపల్లికి చెందిన టీడీపీ కార్యదర్శి గొల్ల శ్రీరాములు అనారోగ్యానికి గురికాగా, శనివారం నాయకులు గ్రామానికెళ్లి పరామర్శించారు. గొల్ల శ్రీరాములు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని స్వగ్రామానికి వచ్చి విశ్రాంతి తీసుకుటున్నారు. విషయం తెలుసుకుని టీడీపీ నాయకులు వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పదివేలు ఆర్థికసాయం చేశారు. అతని ఆర్థికపరిస్థితిని గుర్తించి, ముఖ్యమంత్రి సహాయనిధినుంచి సాయం అందేలా చేస్తామని భరోసా ఇచ్చారు.

కంటి జబ్బులతో కలవరం

జాగ్రత్తలు పాటించకపోతే చూపుపోయే ప్రమాదం



సెల్‌ఫోన్ లైట్ వెలుగులో కంటిని పరిశీలిస్తున్న వైద్యుడు

హిందూపురం అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పురం డివిజన్‌లో కొన్ని రోజులుగా కంటిజబ్బులు ఎక్కువయ్యాయి. వందమందిలో దాదాపు 15 మంది కంటి జబ్బులతో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. సీజన్ ప్రారంభం కావడంతో పలువురికి కళ్ళు ఎర్రబడటం, దురద పుట్టడం, కంటి నుంచి నీరు కారడం, పిసురు కట్టడం జరుగుతోంది. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తోంది. ఈ వ్యాధి సాధారణంగా గాలికాలంలో అంటే జులైలో, మరో మారు అక్టోబరు, నవంబరు మాసాల్లో వస్తుంది. అప్రమత్తంగా లేకపోతే కంటి చూపు ఖతమవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి జనం కంటి చికిత్సల కోసం క్యూ కడుతున్నారు. ప్రతి రోజు కంటి పరీక్షలకోసం దాదాపుగా 70 నుంచి వందమంది దాకా వస్తున్నారు. బాధితులకు చికిత్స అందించే క్రమంలో వైద్యులను కూడా ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. వారు కూడా ఇంటికి వెళ్ళాక కంటిలో చుక్కల మందు వేసుకుని జాగ్రత్తలు పాటిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



కళ్ళు ఎర్రబడటం, నీరు కారడం, పిసుర్లు కట్టడం, కళ్ళు వాపు రావడం, దురద పెట్టడం తదితర సమస్యలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలి. అలా కాకుండా సొంత వైద్యం చేయడం, దురదగా ఉందని ఎక్కువగా కళ్ళు రుద్దడం చేయకూడదు. అలా చేస్తే కంటిలో నల్లగుడ్డు దెబ్బతిని కంటి చూపు పోయే ప్రమాదం ఉంది.

అయిషా, కంటి వైద్యురాలు


త్వరగా వ్యాపిస్తాయి ● శివకుమార్, కంటి వైద్యుడు

సాధారణంగా ఈ వ్యాధులు గాలికాలంలో ఒకరి నుంచి ఒకరికి త్వరగా వ్యాపిస్తాయి. విద్యార్థులకు ఎవరికో ఒకరికి వస్తే అందరికీ సోకుతుంది. కంటికి ఈ సమస్య వచ్చిన వారు నల్ల అద్దాలు వినియోగించాలి. సబ్బు, తువాల్, కర్చీఫ్, తదితర వస్తువులు ప్రత్యేకంగా ఉంచుకోవాలి.

తహసీల్దార్‌గా కరుణాకర్

గుడిబండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుడిబండ తహసీల్దార్‌గా కరుణాకర్‌ను ఉన్నతాధికారులు నియమించారు. రెండు నెలల నుండి తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మడకశిర తహసీల్దార్‌గా పనిచేస్తున్న కరుణాకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరువ పారుతున్న పరిగి చెరువు



చెరువు నిండి వంకలోకి పారుతున్న నీరు

పరిగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దిగువ కర్నాటక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా జయమంగళి నది నుంచి వరదనీరు పరిగి చెరువు చేరడంతో రెండు రోజులుగా మరువపారుతోంది. శనివారం పరిగి చెరువు వంకను చూడటానికి దూర ప్రాంతాల నుంచి ప్రజలు భారీ ఎత్తున తరలివస్తున్నారు. పరిగి చెరువు కింద నీరావరి భూమి 2854ఎకరాలు సాగుచేస్తున్నారు. వచ్చే యేడాదికి నీటి సమస్య ఉండబోదంటూ మండల వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు.

రూ.6 కోట్లతో టీటీడీ కల్యాణమండపం

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సౌకర్యార్థం పెనుకొండ పట్టణంలో నూతనంగా రూ.6కోట్లతో టీటీడీ కల్యాణమండపాన్ని నిర్మిస్తున్నట్లు త్వరలోనే పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. కొండరోడ్డుకు వెళ్లే రహదారిలో ఉన్న ప్రభుత్వ బీసీ కళాశాల శాశ్వత హాస్టల్ భవనాన్ని శనివారం మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీ విద్యార్థులపట్ల జగన్ జగనాసుర అవతారమెత్తారని ఆమె మండిపడ్డారు. బీసీ హాస్టళ్లలో అన్నీ సమస్యలే ఉన్నాయన్నారు. ఇప్పటిదాకా 11నెలల కరెంటు బిల్లుల బకాయిలు కూడా చెల్లించలేదని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.20కోట్లు మంజూరు చేశారని, అలాగే 11నెలల డైట్ బిల్లులు కూడా మంజూరు చేశారన్నారు. బీసీ హాస్టల్‌లో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందిస్తామన్నారు. విద్యార్థులు కూడా అదే తరహాలో కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, పెనుకొండ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్, నాయకులు మాధవనాయుడు, నారాయణస్వామి, చిన్న వెంకటరాముడు, త్రివేంద్ర, రఘు, రామలింగ, మావటూరు గోపాల్, ఎగువగడ్డ క్రిష్ణమూర్తి, దాదు, తదితరులు పాల్గొన్నారు.



బీసీ హాస్టల్ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

ముద్దిరెడ్డిపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు

హిందూపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు పార్టీతోపాటు కార్యకర్త కుటుంబానికి భద్రత కల్పిస్తుందని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం కిరికెర పంచాయతీ, ముద్దిరెడ్డిపల్లిలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డా.సురేంద్ర కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. తెలుగుదేశం పార్టీకి హిందూపురం కంచుకోట సభ్యత్వ నమోదులో కూడా అలాగే పనిచేయాలన్నారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే ఆ కుటుంబానికి ఏదైనా ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.5లక్షల ప్రమాదబీమా అందుతుందన్నారు. పిల్లల చదువుకు, ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

హంద్రీనీవా నీటి సరఫరా పనులు ప్రారంభం



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

సోమందేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి చెరువు కింద 500ఎకరాల్లో ఉన్న ఆయకట్టుకు హంద్రీనీవా కాలువ ద్వారా నీటి సరఫరాకు ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి. గత నెల హంద్రీనీవా కాలువ పరిశీలనకు వచ్చిన మంత్రి సవితను కలిసి రైతులు తమ కష్టాల గురించి మొరపెట్టుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్పందించిన మంత్రి సవిత రైతుల కష్టాలు తీరుస్తామని హామీఇచ్చారు. శనివారం మంత్రి ఆదేశాల మేరకు టీడీపీ హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, పట్టణ కన్వీనర్ సూరీ, హంద్రీనీవా కాలువ నుంచి రైతు పొలాలకు నీరందించేందుకు పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. జేసీబీతో కాలువ నుండి రైతుల పొలాలకు పైప్‌లైన్ అమర్చేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలకల నెరవేరబోతున్నందుకు మంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

కన్నడ భాషకు ప్రాధాన్యం కల్పించాలి

పావగడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాషలోని సంగీతం, సాహిత్యం ఎంతో ప్రాధాన్యం కల్గి ఉందని ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ అభిప్రాయపడ్డారు. జూనియర్ కళాశాల మైదానంలో 69వ కన్నడ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ రాష్ట్రీయ పతాకాలను ఆవిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకొనే దసరా, హంపి ఉత్సవాలు దేశంలోనే ఎంతో ప్రసిద్ధి గాంచాయన్నారు. కన్నడ భాష ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు. వివిధ రంగాల నుండి సేవలు అందించిన 30 మందికి కన్నడ రాజ్యోత్సవ ప్రశస్తి పురస్కారాలను అందించి సన్మానించారు. పత్రికా రంగం నుండి నరసింహులు, ఉదయవాణి సంతోష్‌కుమార్, అంజన్‌కుమార్‌కు సమాజసేవ నుండి సి.కె.తిప్పేస్వామికి, రంగభూమి కళాక్షేత్రం నుండి హనుమంతరాయకు పురస్కారాలను అందజేసి సన్మానించారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

సోమందేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వద్ద తిరుగుతూ ఆడపిల్లలను అల్లరిచేస్తున్న ఎనిమిది మంది ఆకతాయిలకు శనివారం ఎస్ఐ రమేష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల ఓ విద్యార్థినిని వేధింపులకు గురిచేసిన యువకుడిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి చర్యలు తీసుకున్నారు. ఇలాంటి వారి గురించి తమకు గ్రామస్థులు సమాచారం ఇవ్వాలని కోరారు.

సమస్యలు పట్టని సమావేశం

మధ్యలోనే వెళ్లిపోయిన అధికారులు

అగళి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం తూతూ మంత్రంగా కొనసాగింది. ఎంపీపీ రేణుక అధ్యక్షతన జరిగిన సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. అధికారులు తమ శాఖల అంశాలను పూర్తిస్థాయిలో చెప్పలేకపోయారు. సమావేశం ముగిసే సమయానికి టీడీపీ జడ్పీటీసీ ఉమేష్ హాజరయ్యారు. మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి పథకం కింద రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో పనులను చేపడతామని అన్నారు. మహిళలకు దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తామన్నారు. అనంతరం సభ్యుడు ముదిరాజ్ మాట్లాడుతూ అగళిలో ట్రాన్స్‌కో ఏఈ నియామకానికి చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. ఎంపీడీఓ యాదవేంద్ర, టీడీపీ సర్పంచ్ నరసింహమూర్తి, ఎంపీటీసీలు రంగమ్మ, మంజుళమ్మ, వైస్ ఎంపీపీ గాయిత్రి, హేమంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు లక్ష్యం.. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్



గుంతలు పూడ్చే కార్యక్రమం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

మడకశిర టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పడకేసిందని, గుంతలు లేని ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయంగా పెట్టుకొన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం మడకశిర పట్టణ సమీపంలో రోడ్లకు గుంతలు పూడ్చే పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వంలో రహదారుల్లో గుంతలు ఏర్పడినా పాలకులు పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. రోడ్డులో ఏర్పడిన గుంతల వల్ల అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు సైతం కోల్పోయారన్నారు. రాష్ట్రంలో రోడ్లలో గుంతల వల్ల ప్రమాదాలు జరగకుండా ఉండేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.800ల కోట్ల రూపాయలతో మిషన్ పాట్‌హోల్ ఫ్రీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ క్రిష్ణమూర్తి, కౌన్సిలర్లు రమేష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేశారు.. డ్రైనేజీలు మరిచారు

● కాలనీలో ఇళ్ల వద్ద చేరుతున్న మురుగునీరు



సీసీ రోడ్డు కారణంగా ఎటూ వెళ్లలేక నిల్వ ఉన్న నీరు

మడకశిరటౌన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణంలో మారుతీనగర్, బేల్దార్ కాలనీ, నాగన్నకుంట, చిల్లేచిక్కనబండ, ఆదిరెడ్డిపాళ్యం, పావగడ రోడ్డు, హిందూపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇళ్లమధ్యకే మురుగునీరు చేరుతోంది. అదేవిధంగా కొత్తగా ఏర్పాటు చేసిన సీసీరోడ్ల వద్ద డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంవల్ల నీరు ఎటూ వెళ్లే మార్గం లేకపోవడం వల్ల ఇళ్ల మధ్యలోనే నీరు ఆగిపోతోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నామని పట్టణ వాసులు అంటున్నారు. ఒక్కసారి వర్షం కురిస్తే వారంరోజులపాటు పరిసర ప్రాంతం అంతా బురదమయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా డ్రైనేజీ లేకపోవడం వల్ల మురుగునీరు సైతం ఇళ్ల వద్దే ఆగుతున్నాయి. దోమల బెడద అధికమవుతోందని అంటున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు ఆస్కారం ఉందని అనేకసార్లు అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. సీజనల్ వ్యాధులు సైతం ప్రబలి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో మాత్రం బ్లీచింగ్ పౌడర్ చల్లి నామమాత్రంగా శుభ్రం చేయిస్తున్నారని అంటున్నారు. మారుతీనగర్‌లో ఇటీవల సీసీ రోడ్లను కొత్తగా నిర్మించారు. డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడం వల్ల పైప్రాంతం నుండి వర్షపునీరు, మరుగునీరు వచ్చి సీసీ రోడ్డు పక్కలోనే నీరు వెళ్లేందుకు ఆస్కారం లేకపోవడం వల్ల నిల్వ ఉంటున్నాయని దీంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పందులు సైతం స్వైరవిహారం చేస్తున్నాయని అంటున్నారు. అదేవిధంగా మిగిలిన కాలనీల్లో సైతం ఇదే సమస్య ఉందని, అధికారులు వెంటనే డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆపదలో అందుబాటులోకిరాని 108

హిందూపురం అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికోసం 108 సర్వీసులు సకాలంలో స్పందించడంలేదని బాధితులు వాపోతున్నారు. గతంలో 108కి డయల్ చేయగానే ఎక్కడ ఎలాంటి పరిస్థితి నెలకొందో విచారించి పది నిమిషాల్లో అందుబాటులోకి వచ్చేవని, కొంతకాలంగా ఈ నెంబరుకు డయల్ చేసి గంటల కొద్ది వేచి ఉన్నా ఎవరూ అందుబాటులోకి రావడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. హిందూపురంలోని నానెప్పనగర్ నాలుగవ వీధిలో శనివారం 55 సంవత్సరాల వయసున్న పార్వతమ్మ అనే మహిళ స్పృహతప్పి పడిపోయింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేరు. అయితే పనిమనిషి వచ్చి ఎంతసేపు తలుపులు కొట్టినా తీయకపోవడంతో వెనుకవాకిలి గుండాలోకి వెళ్లింది. అప్పటికే పార్వతమ్మ కిందపడి ఉన్న దృశ్యాన్ని చూసి పొరుగింటి వారికి విషయం తెలియజేసింది. వారు వచ్చి 108కు కాల్ చేశారు. లైన్ తగలలేదు. ఇలా అరగంట వరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇలా అయితే కుదరదని పక్కింటి వ్యక్తులు ఆమెను వారి కారులో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. వైద్యులు పరిశీలించి స్కానింగ్ చేశారు. మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఆమెను బెంగళూరుకు తరలించారు. ఆమెను ఐసీయూలోనే ఉంచినట్లు బంధువులు తెలిపారు. సకాలంలో రాని 108 సేవలు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

అగళి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సక్రమమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు సూచించారు. అగళి మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంపై ఆరాతీశారు. అనంతరం భోజనాన్ని రుచిచూసి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యత లేకుంటే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కస్తూరిబా పాఠశాలలోఉపాధ్యాయుల హాజరుపట్టిక తనిఖీ చేశారు. ఎంఈఓ వెంట ఎస్‌ఓ నాగరత్నమ్మ, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.